క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



డిప్యూటీ డీఈఓను కలిసిన బీటీఏ నాయకులు

నెల్లూరు (టౌన్) : డిప్యూటీ డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరనాయక్‌ను ఆయన కార్యాలయంలో బీటీఏ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు రవీంద్రనాథ్, చెన్నకేశవులు, చక్రపాణి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ



నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో వినికిడి యంత్రాలను ఆదివారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు పాండు మాట్లాడుతూ ఆశ్రమ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఎస్ఈఐఎల్ పవర్ ప్లాంట్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు డాక్టర్ సుమన్‌కృష్ణారెడ్డి, డాక్టర్ రాధాకృష్ణ వైద్యపరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలను అందజేశారన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్) : రాష్ట్ర వ్యాప్తంగా అన్నిశాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రాజుభవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ రిటైర్డ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాహనాల నిర్వహణకు బడ్జెట్ కేటాయించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు తెల్లరేషన్ కార్డు ఇచ్చి ప్రభుత్వ పథకాలు వచ్చేలా చూడాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రభుత్వ రిటైర్డ్ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆలపాటి సుధాకర్, పొదిలి చిన్నయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా అరవ భాస్కర్, కోశాధికారిగా ఎల్లయ్య, ఈసీ మెంబర్లుగా హజరత్తయ్య, పురుషోత్తం, దశయ్యలను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యండమూరి నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఏపీ జేఏసీ అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబులను ఎన్నుకున్నారు.

రోడ్డు పక్కనే తాగుతూ.. తూగుతూ..

- దుకాణాల బయటే మద్య సేవనం
- ఏరులై పారుతున్న లిక్కర్
- ఉదాసీనంగా ఎక్సైజ్ అధికారులు

బహిరంగ మద్యసేవనం చట్టరీత్యా నేరమని తెలిసినా మందుబాబులు ఆగడం లేదు. 'మా మందు మా ఇష్టం' అంటూ ఎక్కడపడితే అక్కడ మద్యసేవనం చేస్తున్నారు. మత్తులో ఎటు వెళ్లాలో తెలియక నివాసాలు, షాపుల ముందు, రోడ్లపై, ఖాళీ ప్రదేశాలు ఇలా ఎక్కడపడితే అక్కడ పడి దొర్లుతున్నారు. మద్యం మత్తులో వారి ఆగడాలు శృతిమించుతున్నాయి.



కరెంటాఫీసు సెంటర్‌లో కూల్‌డ్రింక్ షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు



సుబేదారుపేటలో మద్యం మత్తులో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తి

నెల్లూరు(క్రైమ్) : బెల్టు దుకాణాల ముసుగులో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుండటంతో అనేక మంది మద్యం మత్తులో మునిగి తేలుతున్నారు. బహిరంగ మద్యసేవనంపై ఇటీవల డ్రోన్స్ ద్వారా పర్యవేక్షించి కేసులు నమోదు చేసినా.. క్షేత్రస్థాయిలో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి.

తెల్లవారుజాము నుంచే..

ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు మద్యం విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా రూ.5 లక్షల వరకు జరిమానా, రెండోసారి పట్టుబడితే మద్యం షాపు లైసెన్సు రద్దు చేస్తామని ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జిల్లాలో 182 మద్యం దుకాణాలు ఉండగా, తాజాగా మరో 18 దుకాణాలు కలిపి మొత్తంగా 200 మద్యం దుకాణాలున్నాయి. మద్యం అమ్మకాలు పెంచుకుని జేబులు నింపుకునేందుకు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. సమయపాలన పాటించడం లేదు. మద్యం దుకాణాలు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించాల్సి ఉండగా అనేక ప్రాంతాల్లో సమయపాలన కాసరావడం లేదు. తెల్లవారుజాము నుంచే విక్రయాలు సాగుతున్నాయి. మద్యం దుకాణాల వద్ద కూల్‌డ్రింక్ షాపుల ముసుగులో అనధికారికంగా ఏర్పాటు చేసిన పర్మిట్‌రూమ్‌లు మినీ బార్లను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల దుకాణాల ముందే మద్యసేవనం చేయిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు

నగరం నుంచి గ్రామాల వరకు బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. బెల్టుషాపుల్లో యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారు. అడపాదడపా దాడులు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. బెల్టుకు మద్యం ఎక్కడ నుంచి వచ్చింది? ఎవరు సరఫరా చేశారు అనే మూలాల్లోకి వెళ్లడం లేదు. అధికారులు మాత్రం పట్టుబడిన మద్యం బాటిళ్లపై లేబుల్స్ ఉండకపోవడంతో ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమవడం వెనుక వ్యాపారులతో కుదుర్చుకున్న లోపాయికారి ఒప్పందాలే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాల్సి ఉంది.



ఖాళీ ప్రదేశంలో మద్యం తాగుతూ..



కరెంటాఫీసు సెంటర్‌లో మద్యం దుకాణం ముందే తాగుతూ..



ములుమూడి బస్టాండ్ సమీపంలో..

'రంగడి' బ్రహ్మోత్సవాలకు స్తంభ ప్రతిష్ట నేడు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మార్చి 9 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు నాందిగా సోమవారం ఉదయం 9 గంటలకు స్తంభ ప్రతిష్ట (పందిరి గుంజ) జరుగనుందని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు చుక్కలు

నెల్లూరు (టౌన్) : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు చుక్కలు చూపిస్తోందని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులకు జరిగిన క్లస్టర్ సమావేశం సాయంత్రం 5 గంటలకు ముగిసినా ముఖ హాజరును 6 గంటల వరకు అనుమతించలేదన్నారు. హాజరు వేయకుండా వెళ్లిన ఉపాధ్యాయులు అధికారులకు సంజాయిషీ ఇవ్వాలని బెదిరించడం దారుణమన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు, ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెడతామని చెప్పిన లోకేశ్ ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పిన చంద్రబాబు నుంచి ప్రస్తుతం ఎలాంటి స్పందన లేదన్నారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం

నెల్లూరు(సెంట్రల్) : సీతారామపురం మండలంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అందజేశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆలయ నిర్వాహకులకు ఈ విరాళాన్ని ఆదివారం అందించారు. కాగా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి వేమిరెడ్డి దంపతులను అర్చకులు ఆహ్వానించారు.

స్విమ్మర్ నాగరాజుకు అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : స్విమ్మర్ తులసి నాగరాజును పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన 1.5 కిలోమీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో 51–60 సంవత్సరాల విభాగంలో నాగరాజు ద్వితీయ స్థానం సాధించారన్నారు. దీంతో పెన్నానది తీరంలో సన్మానించినట్లు వివరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మునగా నాగేశ్వరరావు, హైటెక్ ఫార్మా కంపెనీ అధినేత రమణారెడ్డి, సుధాకర్‌రాజు, బీవీ కృష్ణారెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు

నెల్లూరు(బృందావనం) : జెండావీధి కోటమిట్టలోని హాజీరా హాస్పిటల్లో చెన్నైకి చెందిన ఆక్సిమేడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్యులు సమ అక్బర్, ఆయాజ్ అక్బర్‌ల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేశారు. సుమారు 300 మందికి బీఎంఐ, బీపీ, ఈసీజీ, ఎకో, ఆర్‌బీఎస్, టోటల్ కొలెస్ట్రాల్, హెచ్‌బీ తదితర పరీక్షలు చేసి మందులను అందజేశారు. మరో వంద మందికి షుగర్, బీపీ తదితర రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో నవీద్‌అహ్మద్, హుమాయున్, ఫిర్దోజ్‌ఖాన్, సిరాజుద్దీన్, ఇంతియాజ్, అబ్దుల్‌ఖయ్యూం, సాబిర్ సాజిద్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.



వివాదాలు తగదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ములుమూడి బస్టాండ్ సమీపంలో ఆజాద్ సెంటర్ వద్ద వివేకానంద విగ్రహ ఏర్పాటుపై బీజేపీ నేతలు వివాదాలు సృష్టించే ప్రయత్నం చేయడం తగదని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ ఆరోపించారు. నగరంలోని ఆజాద్ సెంటర్ సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారాయణ జోక్యం చేసుకుని వివాదాన్ని పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

నెల్లూరు సిటీ : ముందు వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో బల్కర్ వాహనం చెట్టును ఢీకొని క్లీనర్ మృతిచెందిన ఘటన కాకుపల్లిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన కుసులేందర్(21) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బల్కర్‌లో యాష్‌లోడ్‌తో ముత్తుకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్నారు. కాకుపల్లి వద్ద ముందు వెళ్తున్న మరో లారీని క్రాస్ చేసేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొంది. దీంతో చెట్ల కొమ్మలు లోపలకు చొచ్చుకొచ్చి క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం వల్ల ఇతర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్ 14న ఎస్టీ వర్గీకరణ భేరి



మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏప్రిల్ 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరిని నిర్వహించనున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. నగరంలోని గిరిజనభవన్‌లో యానాదుల సంక్షేమ సంఘం, యానాది గిరిజన ఉద్యోగుల సంఘాల కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలన్నారు. ఇందులో భాగంగా అదే రోజు యానాది రిజర్వేషన్ పోరాట సమితిని ప్రారంభించనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు చేవూరు సుబ్బారావు, చెలంచర్ల పెద్ద బ్రహ్మయ్య, చెంబేటి ఉషా, రాపూరు కృష్ణయ్య, తలపల చెంచుమల్లికార్జున, చంద్రమౌళి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీలోకి భారీగా యువత, మహిళలు చేరుతున్నారు. స్థానిక 26వ డివిజన్‌కు చెందిన యువనేత యనమండ్ర విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో యువత, మహిళలు ఆదివారం చింతారెడ్డిపాళెంలోని ఆనం నివాసంలో పార్టీ చేరారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు యువత కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్), పార్టీ నేతలు కనగట్ల మోహన్‌రాజు, విడవలూరు బాబురావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, రూరల్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రోహిత్, మజురుల్లా, ఏలూరు మనీ, అనిల్, బాలాజీ, సామ్రాజ్యం, శైలజ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ ఆదాల ఆశీర్వాదం



మాజీ ఉపరాష్ట్రపతి మనుమడి వివాహ రిసెప్షన్‌లో ఆదాల, వైఎస్సార్‌సీపీ నేతలు



ఐరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కుమార్తెను ఆశీర్వదిస్తున్న ఆదాల

నెల్లూరు(బారకాసు) : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనుమడు విష్ణు వివాహ రిసెప్షన్‌కు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో జరిగిన వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

- నగరంలోని 31వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఐరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కుమార్తె వివాహ వేడుకకు సంబంధించి ఆదివారం విజయలక్ష్మీనగర్‌లో జరిగిన గంధపు నలుగు కార్యక్రమానికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. వధువు జాహ్నవిని ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు స్వర్ణ వెంకయ్య, శ్రీనివాస్, హరిబాబుయాదవ్, మల్లు సుధాకర్‌రెడ్డి, కొండేటి నరసింహారావు, అల్లాభక్షు, ముత్తంగి రామయ్య, మొయిద్దీన్, బెల్లంకొండ వెంకయ్య, నాని ఉన్నారు.

పార్కుల్లో జిమ్ పరికరాల ఏర్పాటు

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని పలు పార్కుల్లో జిమ్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 5, 14వ డివిజన్‌లలో ఉన్న పార్కుల్లో జిమ్ పరికరాల ఏర్పాటును కమిషనర్ సూర్యతేజతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పార్కుల్లో జిమ్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. వీటితో పాటు కొన్నిప్రాంతాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు సూచనలు చేశామన్నారు. నగరంలోని అండర్ డ్రెయినేజీని పునరుద్ధరిస్తామన్నారు.



సండే అయితే ఇబ్బందే..

- మినీబైపాస్ రోడ్డుపై జోరుగా చేపల విక్రయాలు
- నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం
- పట్టించుకోని పోలీస్, నగరపాలక సంస్థ అధికారులు



మినీబైపాస్ రోడ్డు పక్కనే ఏర్పాటైన చేపల దుకాణాలు

నెల్లూరు(బారకాసు) : నిత్యం రద్దీగా ఉండే మినీబైపాస్ రోడ్డులో ఆదివారం వచ్చిందంటే చాలు చేపల మార్కెట్లు వెలుస్తాయి. గత కొంత కాలంగా ప్రతి ఆదివారం మినీబైపాస్‌రోడ్డుపై అన్నమయ్య సర్కిల్ సమీపం నుంచి వనంతోపు సెంటర్ వరకు చేపలు, రొయ్యల విక్రయాలు జోరుగా జరుపుతున్నారు. కొనుగోలుదారులు రోడ్డుపైనే తమ వాహనాలను నిలిపి అక్కడే చేపలు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ప్రతి ఆదివారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు మినీబైపాస్ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వ్యాపారం జోరుగా ఉండడంతో వారంలో రెండుమూడు రోజుల పాటు విక్రయాలు జరుపుతున్నాయి. చేపల విక్రయాలైన తరువాత అక్కడి చుట్టుపక్కల ప్రాంతాల వారు వాటి దుర్వాసనతో ముక్కులు మూసుకోవాల్సి వస్తుండటంతో పాటు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుకూలంగా ఉండడంతో..

వాస్తవానికి పెద్దబజారు సమీపంలో, మైపాడు రోడ్డు వేణుగోపాల్‌నగర్ వద్ద, శెట్టిగుంటరోడ్డు వద్ద చేపల మార్కెట్లు ఉన్నాయి. వాటిలో చేపలు విక్రయాలు జరుపుతున్నప్పటికీ మరింత మందికి అనుకూలమైన ప్రదేశం లేకపోవడంతో మినీబైపాస్ రోడ్డును వారు ఎంచుకున్నారు. మొదట్లో పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. అయితే రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుండడం, మరోవైపు అక్కడి ప్రాంతంలో భవనాలు వెలుస్తుండడం వల్ల చేపల విక్రయాలతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇదంతా అటు పోలీసులకు, ఇటు నగరపాలక సంస్థ అధికారులకు తెలిసినా కేవలం మాముళ్లకు పాల్పడి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మినీబైపాస్‌రోడ్డులో చేపల విక్రయదారులకు ప్రత్యామ్నాయంగా మరో ప్రదేశం చూపించి వారిని అక్కడికి తరలించేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన ట్రాఫిక్

ప్రత్యామ్నాయం చూపించాలి

మినీబైపాస్ రోడ్డుపైనే చేపలు, రొయ్యల విక్రయాలు జరపడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆయా విక్రయదారులకు ప్రత్యామ్నాయం చూపించాలి. ఏదైనా ఖాళీ స్థలాన్ని వారికి కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే నగర ప్రజలకు ఇబ్బందులు ఉండవు.



– రమణారెడ్డి, నెల్లూరు

ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది

ఇక్కడ ప్రతి ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీని గురించి మున్సిపల్, పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రతరం అవుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.



– అశోక్‌కుమార్, నగర వాసి

ఆరోగ్యంగా ఉండాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మంచి ఆహారపు అలవాట్లు, సరైన వ్యాయామంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ క్యాంపులను నిర్వహించడం అభినందనీయమన్నారు. చెన్నై ఆస్పత్రి ఇన్ఫర్మేషన్ అధినేత ఎస్వీ రమేష్‌బాబు సౌజన్యంతో డాక్టర్లు నిఖిలరెడ్డి, శ్రీధర్‌రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, అసోసియేషన్ కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి ప్రసాద్‌నాయుడు, ఎలక్టడ్ గవర్నర్ బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి